
కథ



# పాల నలుపు

గేటు తీసి గదివైపు నడిస్తే

తలుపులు బార్లా తెరిచివున్నాయి.

ఆయనింకా వచ్చినట్టులేరు.

చీకటిపడ్డా లైటువేసి లేదు

'మానస' ఎక్కడికెళ్లివుంటుంది?

'మనూ'

హాలు, బెడ్‌రూమ్

కిచెన్‌లో వుండదు

'మనూ'

పెరట్లో జామచెట్టుకింద

ఏదీ ఎక్కడా కనిపించదే?

రహస్యంగా దాక్కొని నన్ను ఫూల్‌ని చేస్తుందేమో!

పింక్‌గౌను?

అదేమిటి ఆ మూలన పూలకుండీల మధ్యనపడింది

ఏయ్ మనూ! ఇక్కడ పడుకున్నావేమే!

కదలదేమిటి?

మనూ? చిన్నీ?

మనూబేటా

కాళ్లవెంట రక్తం

రక్తమేమిటి?

ఏమిటి? ఏమిటి? రక్తమెందుకొచ్చింది?

గౌనుకంతా రక్తం

గౌనులేపి చూస్తే రక్తం- రక్తావయవాలు

పసిగులాబీలు చుట్టూ రాలిపోయాయి, చిందరవందర

ఏమైందిరా! లే! మాట్లాడు కన్నా!

సొమ్మసిల్లిన మానస

చూచాయగా ఏదో అర్థమౌతుంది

ఓ! నో!

సారీ మై చైల్డ్ సారీ!

నిన్నొంటరిని చేసి... ఓ గాడ్...

ఎవడు? ఎవడు?

బిడ్డా ఎవడే రాక్షసుడు- స్టుపిడ్

మనూ లే బిడ్డా!

చేతులతో లేవనెత్తుకెళ్లి బెడ్‌మీద పడుకోబెట్టి ముఖంమీద నీళ్లుచల్లింది. పాప కొంచెం కదిలింది. కళ్లు విప్పి చూసింది.

చెమటలు పట్టిన అమ్మ ముఖం చూసి భోరున ఏడ్చింది.

ఏమైంది మనూ!

అమ్మ దుఃఖపు పెదాలు చూసి గట్టిగా 'అమ్మా' అని అరుస్తూ హత్తుకుపోయింది.

అమ్మా నొప్పి ఏడుస్తూనే

ఎక్కడమ్మా!

ప్యాస్ దగ్గర

భగ్గున మంటలు రేగాయి గుండెలో

కకావికలాలై

చెల్లా చెదురై

ఒళ్లంతా పోటు

తలలో దుఃఖం కాగుతుంది

ఎవడే? ఎవడేవాడు. మనసులోని మాట బయటకు రావటంలేదు.

ఎవడని అడగాలి?

ఎలా చెప్పుంది తను.

ఎంత పాపని?

నాలుగేళ్ల పాప.

మొన్నే, ఒక నెలకింద పుట్టినరోజు చేసుకున్న పింక్‌గౌనులో...

గౌను విప్పేసింది.

టవలు నీళ్లల్లో ముంచి తుడిచి మరో గౌనువేసి గబగబా భుజాన పాపతో బయల్దేరింది.

** ** **

తనకు తెలిసిన లేడీ డాక్టర్ చాంబర్.

హడావిడిలోంచి లోపలికెళ్లడానికి జంకు ఐనా వెళ్లాలి.

మనూను త్వరగా చూపించాలి.

రిక్వెస్టుగా గేటు దగ్గర నిలబడ్డ పేషంటు వైపు చూస్తూ లోపలికెళ్లింది.

డాక్టర్‌తో మాట్లాడ్డానికి ముందు దుఃఖమే అడ్డొస్తుంది.

ఎలా చెప్పాలి?

హౌ టు ఎక్స్‌ప్లయిన్ మేడమ్!

చెప్పమ్మా

మీరే చూడండన్నట్టు గౌను పైకి తీసి అండర్‌వేర్ తీసింది.

'నొప్పి'

పాప ఏడుపు

డాక్టర్ పాపను పడుకోబెట్టి పరీక్షించింది.

కందరాలు- చాలా చిన్ని చిన్ని కందరాలు

పాపల చేతులెలా వుంటాయి

నవ్వినపుడు ఎర్రెర్రని బుగ్గలెలా వుంటాయి

వెలుతురు పెదాలెలా వుంటాయి

అవే కందరాలు- రెమ్మల్లాంటివి- చీలిపోయాయి

రక్తంతో గాయాలమయమై

అమ్మానొప్పి

భుజం మీదికి చేరి వాలిపోయింది పాప.

బాగా జడుసుకుంది

ఏడ్చే ఓపికకూడా నశించింది

మందులు రాసిచ్చింది డాక్టర్.

ఇలాంటి సమయాల్లో ధైర్యంగా వుండాలి. పాపకు సెక్యూరిటీ కల్గించాలి. మీరు ఏడ్వటం మరింత డిప్రెషన్ కల్గిస్తుంది. విశ్రాంతి నివ్వండి. ఆ సంఘటనను మర్చిపోండి. టేకిట్ యాస్‌యన్ ఆక్సిడెంట్- ఇంకా ఏమో చెప్పింది.

అన్నీ ఆ తల్లి చెవిని సోకలేదు. తన అనుమానాలు కొన్ని తీర్చుకొని బయటకొచ్చింది.

డా. పులిపాటి గురుస్వామి

మందులు కొని ఇంటికి చేరింది.

ఆయనింకా రాలేదు ఓ గాడ్!

రోజురోజుకి ఈయన ఆలస్యం

దురదృష్టం- తనూ ఈరోజు గంట ఆలస్యంగా వచ్చింది

దున్నపోతులు

ఆలస్యానికి కారణమైన బస్సు డ్రైవర్, ఆటో డ్రైవర్ల పంచాయితీ

ట్రాఫిక్ జామ్

ఎవడి సంగతీ మరొకడికెందుకు?

నగరం బాబోయ్! శ్లాటర్‌హౌజ్

పాప పడుకుంది.

మందులు తాగడానికి మారాం చేసే పాప గొడవ చేయకుండా తాగేసింది

ఎంత నొప్పేసిందో నా తల్లికి

నా బంగారం

నిన్నెలా నలుపబుద్ధియిందే!

కుక్కల కొడుకు!

** ** **

ఇటువైపు ఎవరొచ్చారో ఎవర్నైనా అడిగితే-

ఎవరు చెప్తారు

అనవసరంగా తెలియచెప్పినట్టవుతుంది

మాకు తెలియదంటూ నోళ్లు వెళ్లబెడ్తారు నో!

పోలీసు రిపోర్టివ్వాలి

ఆయనెప్పుడొస్తాడో అలసిసొలసి

తినడానికి ఏమీ చేయాలన్పించలేదు

పాప వీపు నిమురుతూ పక్కమీద ఒరిగింది.

దుఃఖం

మెదడుకీ శరీరానికీ మధ్య దుఃఖం

ఆలోచనకి అంతర్యానికి మధ్య దుఃఖం

మనసు పొరలనిండా దుఃఖం

పోరాడి పోరాడి పిల్ల భవిష్యత్తు కోసం, పట్నం చదువులకోసం ఒక్కరు పనిచేస్తే చాలదని, ఒప్పించి, మెప్పించి ఉద్యోగంలో చేరింది.

పదేళ్ల పనిపిల్లను పెట్టింది.

పాపను ఆడించి, పాలు పట్టిస్తుంది. అన్నం తినిపిస్తుంది. సాయంత్రం ఐదు కాగానే ఠంచనుగా అదెళ్లిపోతుంది. ఆ సమయానికి వేరే ఇంట్లో పనికి కుదిరింది. మామూలుగా తనాపాటికి వచ్చేస్తుంది. ఐదు పది నిమిషాల లేటుగా వచ్చినా పాప ఒక్కత్తే కూచొని ఎదురుచూసే అలవాటయ్యింది ఈమధ్య.

ఈరోజు జరిగిన గంట ఆలస్యానికి పెద్ద మూల్యం చెల్లించాల్సి వచ్చింది.

నరాలు తెగిపోతున్నాయి.

గొంతులో బంధించబడ్డ దుఃఖం కొంచెంకొంచెం బీల్చుకు వస్తూ అలలై ముంచింది.

** ** **

'రాణీ'

రాణీ!

హాల్లోనుండి బెడ్‌రూంలోకొచ్చిన వేణు

'బయటి తలుపులు కూడా వేసుకోకుండా పడుకున్నావేమిటోయ్!'

తలుపులు వేసొచ్చాడు.

భార్య పక్కకు వాలి 'ఏంటమ్మా! అలకా!'

తనవైపుకు తిప్పుకున్నాడు.

దుఃఖం ఒలికింది.

అవాక్కై 'ఏమైంది రాణీ'

ఆదుర్దా కలిసిన ఆప్యాయత

మందలింపు

ఓదార్పు

ఏం జరిగిందో చెప్పు.

పసిపిల్లలా అతని ఒళ్లోకి

దుఃఖం కౌగిలింత

వెచ్చని భయం

పాప నిద్రపోతుంది పక్కన

విషయం చెప్పటానికి దుఃఖం దారి వదిలితేగా!

ఓ పావు గంట తర్వాత

ముక్కలు ముక్కలుగా వాస్తవం వేణుకి తెలిసింది.

మానస పాదాల మీదికి తలవాల్చి క్షమించమని భోరున విలపించాడు

రక్షణనివ్వలేని అసమర్థతకి గుండెని పిండుకున్నాడు

పాపను లేపడానికి భయపడ్డాడు

లేచి ఏడ్వడం మొదలుపెడితే తట్టుకోగలడా!

డాడీ నొప్పిని తగ్గించమంటే నేనేం చేసేది?

మనూ

నిశ్శబ్దంగా

మను బేటా

మహానిశ్శబ్దంగా

కొన్నివేల లోలో ఆక్రందనలు.

కాసేపటి మౌనం తర్వాత హాల్లో సోఫా మీదికి చేరాడు వేణు.

** ** **

తను ఎప్పటినుండో చెప్తూనే వున్నాడు. సెక్యూరిటీలేని జీవితాలేమౌతాయో ఏకరువు పెడుతూనే వుంటాడు.

కనీసం తల్లిదండ్రుల్ని తెచ్చుకోవచ్చు

ఊర్లో ఆ మూల ఈమూల కాలం తోస్తున్నవాళ్లను ఇంట్లో ఉంచుకోవచ్చు

మనుషులకి మనుషులకి మధ్య కొండంత దూరం

చెప్పడానికి బంధుత్వాలకేం చాలా దగ్గర.

తప్పుచేయడానికి అవతలివానికి ఎంత ఛాయిస్ ఇచ్చామనేది అర్థమైపోయింది వేణుకి.

రాణి కూడా హాల్లోకి చేరింది

పొద్దున్నే పోలీస్ కంప్లయింట్ చేద్దాం అంది

ఎందుకు? ఊరంతా చాటింపు చేసుకోవడానికా?

ఏమిటండి మీరనేది?

కాకపోతే దేనికోసం కంప్లైంట్

వాడెవడో పట్టుకొని శిక్షించాలి

ఆవేశం పక్కకు పెట్టు. దొరుకుతాడా! పోనీ వాడ్ని ఏంచేస్తే నా నిన్నటి మనూ దొరుకుతుంది చెప్పు

దుఃఖము కోపము కలిసిన పదాలు.

పైగా చంపేస్తారు జనం

చూడుచూడు మానస వెళ్తుంది అంటూ వేలెత్తి చూపిస్తారు.

మన పక్కన నడుస్తుంటే అదుగో వాళ్ల మ్మాయే మొన్నా...

అంటూ పంచుకుంటారు.

ఆ సంఘటన దానికి గుర్తింపు మచ్చలా మారి రోజురోజు దాన్ని హింసిస్తారు జనం

వద్దు

వద్దేవద్దు.

పోలీసువాళ్లు వేసే చిత్రమైన ప్రశ్నల హింసలు భరించలేం.

నీకు నాకు తల్లిదండ్రులున్నారుకదా తెచ్చుకోవచ్చుగా అంటే ఏం చెప్తావ్?

మాలో మాకు పడవు- మనుషుల్ని దగ్గరకు రానివ్వమని చెప్పగలవా!

నిజాయితీగా మనమే చేశామీ అత్యాచారాన్ని.

తల్లిదండ్రుల పాత్రకంటే ముందు మనం పరాయివాళ్లం

ఒకరికొకరు పరిచయం తక్కువ

ఒకరి అభిప్రాయాలొకరికి హీనం

ఒకరి అలవాట్లొకరికి జుగుప్స

ఒకరి బంధువులొకరికి వెటకారం

ఒకరి ప్రేమ మరొకరికి నటన

ఇన్ని అవాంతరాల మధ్య

పరస్పర అనేకవేల అంతర్యుద్ధాలు

వందల బహిర్‌యుద్ధాలు

జీవితాలని సస్యశ్యామలం చేసుకుంటు న్నామా!

కనీసం ఒకరోజునైనా వెన్నెలగా కప్పుకున్నామా!

పరుగు

పడిలేచే పరుగు

సంపాదన

బంగారు నగలు

స్థిరాస్థులు

సైడ్ బిజినెస్‌లు

తెలివిలేని వాళ్లకి ఏదీ చేతకాదని స్టేట్ మెంట్లు

ఏం చేసుకుంటామే-

బాంక్‌లో యాభైవేలున్నాయి నిన్నటి నా మానసను తెచ్చిపెట్టు

సంకుచితులం మనం

సమరం చేస్తున్న సంసారులం



**దుఃఖాన్ని అదిమిపెట్టుకున్నారిద్దరూ**
**శబ్దాలకి పాప లేస్తుందేమోనని**
**జాగ్రత్తపడుతున్నారు.**
**వేణు పాప నుదురు మీదుగా తన చేత్తో**
**దువ్వుతూ ముద్దుపెట్టుకున్నాడు**

అందర్నీ కల్గివుండీ ఎవరూలేని అనాథ నా మానస ఇవాళ.

అది నిన్నూనన్నూ

నిశ్శబ్దంగా

కొన్నివేల ప్రశ్నలడుగుతుంది.

ఒక్కదానికి సమాధానం చెప్పు. ఏం చెప్తావో చెప్పు.

దుఃఖం

నిశ్శబ్దం

ఇరువురి దుఃఖం

నిశ్శబ్దం.

అతన్ని కదిలించాలన్పించక బెడ్ రూంలో మానస పక్కకు చేరింది.

నిద్ర ఇక ఎవర్నీ ఏమీ ఆలోచించనివ్వ లేదు.

** ** **

తెల్లవారుఝాము ఐదు గంటలకే అతను రడీ అవుతుండటం రాణికి ఆశ్చర్యం కల్గించింది. ఇంకా కోపం దిగలేదేమో. ఈరోజు సెలవుపెట్టి పాపతో గడుపుతాడని ఆశించింది. అతని చర్య ఆమెను అగాథంలోకి తోస్తున్నట్టుగా వుంది.

లేచి బెడ్‌మీద కూచొని గమనిస్తుంది అతన్ని.

తల దువ్వుకుంటూ అతను సారీ! ఈరోజు నుండీ 'జన్మభూమి'- ప్రభుత్వపు మొగుడు

తాత్కాలిక ఆఫీసరు హోదా

నేనెవడికీ చెప్పుకోవటానికి లేదు

ఇంట్లో పెళ్లాం పిల్లలకేమైనా, తల్లిదండ్రులకేమైనా జన్మభూమికి మాత్రం తప్పక హాజరుకావాలి

చట్టాలు- చట్రాలు

రిపోర్టు చేసే సమయమూలేదు

ఒకవేళ చేసినా సంజాయిషీ ఇవ్వాలి లేదా

మందలింపులు

మెమోలు

ఆఫీసర్ల చివాట్లు

ప్రభుత్వపు తిట్లు

జన్మభూమి బొబ్బట్లు

దయచేసి నా అశక్తతను మన్నించు. నువు సెలవుపెట్టు.

మందులు వేస్తూ మనూతో హాయిగా ఉండటానికి ప్రయత్నం చెయ్యి.

దిగులు కన్పించనీయకు. ఒకవేళ సంఘటనను తను గుర్తుచేసినా మామూలు విషయంలా తీసిపారేసి వేరే విషయాలమీదికి మళ్లించు

'నా చిట్టితల్లీ నన్ను క్షమించు'

మానస పాదాలమీదికి తల ఆన్చినపుడు రాణి గుండెల్ని తోసుకు వచ్చింది మళ్లీ దుఃఖం

'వీలైతే త్వరగా రావడానికి ప్రయత్నిస్తాను'

వెళ్లిపోయాడు

** ** **

సాయంత్రం ఐదునుండీ ఎదురు చూస్తూనే వుంది అతని కోసం.

అలికిడైన ప్రతిసారీ అవతలికి తొంగి చూసినా నిరాశే మిగిలింది.

రాత్రి తొమ్మిదిదాటాక పాప పడుకుంది.

తనూ బాగా అలిసిపోయింది

ఎదురుచూస్తూ హాల్లో సోఫాలోనే కునుకుతీసింది

వేణు వచ్చి లేపేసరికి పదకొండు దాటింది

ఎందుకు లేటయిందని అడగలేదు

తనకు తెలుసు

జన్మభూమి తతంగమంతా ఇట్లాగే వుంటుంది.

ఇద్దరూ ఏమీ మాట్లాడుకోకుండానే- అతను స్నానం ముగించుకొచ్చాడు

కాస్తంత ఎంగిలిపడ్డారు. ఏమీ తినాలన్పించడంలేదు.

మనసు బాగా అలిసిపోయింది

మానస పక్కన వాలిపోయాడు వేణు

మరోపక్క రాణి కూచుంది

తనే నోరు విప్పింది

మధ్యాహ్నం దాకా అడపాదడపా ఏడుస్తూనే వుంది. ఆ భయంకర దృశ్యం దాన్ని వెంటాడుతున్నట్టే వుంది.

పక్కింటి చంటీగాడు రాగానే భయంతో అరిచేసింది. వాడితో ఆడుకునేదే ఐనా వాడు పోయిందాకా ఏడుపాపలేదు.

బలవంతంగా కొంచెం పెరుగన్నం తిన్నదంతే.

ఇద్దరి గొంతులోకి మళ్లీ దుఃఖం తలుపు తెరుచుకుంది.

'అమ్మా నొప్పి నొప్పి అంటూ గౌను లేపి చూపిస్తావుంది.

దాని ఒళ్లు కమిలి దద్దులు లేచా...యి...'

దుఃఖాన్ని అదిమిపెట్టుకున్నారిద్దరూ

శబ్దాలకి పాప లేస్తుందేమోనని జాగ్రత్త పడుతున్నారు.

వేణు పాపనుదురు మీదుగా తన చేత్తో దువ్వుతూ ముద్దుపెట్టుకున్నాడు

దుర్భరమైన అలజడి రేగుతుంది లోపల.

తనింకా ఏదో చెప్పుకుపోతుంది.

మరో ఆలోచనలో వేణు

నేరభావనలో లోపలంతా సిగ్గు

కొద్దిరోజులు పాపతో ఎక్కడికైనా వెళ్లి రావాలి. ఈ జ్ఞాపకాల్లోంచి తనని దూరంగా తీసుకుపోవాలి.

ఎల్లుండి తను రాలేనని, ఏర్పాట్లేవో చేశాడు

రేపొక్కరోజు వెళ్లడానికి ఎన్నో లోలోపలి అభ్యంతరాల మధ్య సిద్ధమవుతుండగా నిద్రపట్టింది.

** ** **

ఐదు గంటలకి లేచాడు వేణు.

రాణిని లేపి ఈ ఒక్కరోజు తప్పనిసరిగా వెళ్లిరావాలోయ్ ఇన్‌స్పెక్షన్ వుంది. రేపు పాపతో ఎక్కడికైనా వెళ్దాం రెండ్రోజులు.

రాణి మౌనంగానే విన్నది.

అతను బాగా అలిసిపోతున్నాడని అర్థమవుతుంది

కాసేపటి తర్వాత ముఖం కడుక్కొని వచ్చాడు

'స్నానం చేసేలోపు రెండు చపాతీలన్నా చేసి పెట్టరాదూ-

నీకు చేతనైతేనే- కాంపులో తినలేక పోతున్నాను'

అభ్యర్థన ఆమెను కదిలించేసింది.

రెండ్రోజులుగా ఒకర్నొకరు పట్టించుకోవటమే మానేశారు

హడావిడిగా వంటింట్లోకి వెళ్లింది

అన్నీ చిందరవందర

వాసనకొడుతున్న సింకు

చెల్లాచెదురుగా వంట గిన్నెలు

పాలగిన్నె మాడిపోయింది

ఒక్కొక్కటీ సర్దుకుంటూ చపాతీలు చేయడంలో నిమగ్నమయింది.

ఏడ్చిఏడ్చి ఒళ్లంతా దెబ్బలుకొట్టి పడుకోబెట్టినట్లుంది

ఓపికలేకున్నా చపాతీలు చేసి టిఫిన్‌లో సర్ది రడీ ఐన వేణుకు అందించింది.

ఒక్కసారి పాపను లేపుతాను. అది నిన్నకూడా మిమ్మల్ని చూడలేదు- అంది

ఒద్దులే నిద్రపోతుంది కదా

లేదండీ మీరు పలకరిస్తే దానికి కాస్త ఊరట కల్గుతుంది

వెళ్లి పాపను లేపుకొచ్చింది

అతన్ని చూడగానే పాప కెవ్వున కేక వేసింది

డాడీ డాడీ బేటా- రాణి సముదాయింపు

వద్దువద్దు- పాప ఏడుపు

పలకరించడానికి పట్టుకోడానికి హడలి వెళ్లిపోయాడతను.

తండ్రిని చూసికూడా భయపడటాన్ని రాణి తట్టుకోలేక కుప్పకూలింది. ●